

ఒకరు పథకాలన్నారు.. ప్రజా సంక్షేమం అన్నారు.. వలంటీర్లు దేవుళ్లన్నారు, కాబోయే నాయకులన్నారు.. ఒడిలో వేలు కుమ్మరించామన్నారు. అభివృద్ధే గెలిపిస్తుందని దబాయించి చెప్పారు.


మరొకరు మరింత సంక్షేమం మా లక్ష్యం అని ఎలుగెత్తి ప్రకటించారు. పెంచిన పింఛను లెక్కలు కళ్లముందు తళతళలాడించారు. అభివృద్ధికి అసలైన చిరునామా మేమే అన్నారు.

నిజానికీ అబద్ధానికీ నడుమ రేఖ చెరిగిపోయింది. భయమా.. భరోసానా..? ఏది పనిచేసింది? ఏ బటన్ దేన్ని నొక్కింది? వెదజల్లిన వందల కోట్లు ఏమి పలికించబోతున్నాయి?

జనం నొక్కిన బటన్ ఎవర్ని పాతాళానికి తొక్కిందో, ఎవర్ని గద్దెనెక్కించిందో అంతుపట్టక లబ్‌డబ్ గుండెలతో రోజులు గడిపేశారు. రహస్యాన్ని గుండెల్లో దాచుకున్న పెట్టెలు నేడు నోళ్లు విప్పబోతున్నాయి. నాయకులారా బహు పరాక్!

తేలనున్న పార్టీల, అభ్యర్థుల భవితవ్యం

ప్రధాన పార్టీల శ్రేణులతో చిత్తూరులో లాడ్జీలన్నీ ఫుల్



దేవుడా.. దేవుడా.. దేవుడా!

ఎన్నికల ఫలితాల వెల్లడి నేడే

ఎవరు ఎమ్మెల్యే?

ఇంకొన్ని గంటల్లోనే తేలనుంది ● ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

చిత్తూరు, ఆంధ్రజ్యోతి/ చిత్తూరు కలెక్టరేట్, జూన్ 3: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అన్ని పార్టీలు, స్వతంత్రులు కలిపి 78 మంది.. చిత్తూరు పార్లమెంటుకు 19 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధానంగా పోటీ ఉండేది టీడీపీ, వైసీపీ మధ్యనే. అంటే, రెండు పార్టీల తరపున అసెంబ్లీకి 14 మంది.. పార్లమెంటుకు ఇద్దరున్నారు. వీరిలో ఏడుగురు ఎమ్మెల్యేలు.. ఒక ఎంపీ అయ్యేది ఎవరు? ఈ విషయం ఇంకొన్ని గంటల్లోనే వెల్లడి కానుంది. మిగతా వారికి పడిన ఓట్లు.. గెలుపు ఓటములపై వారి ప్రభావం ఉందా అనేదీ తేలిపోనుంది. మే 31న పోలింగ్ జరిగాక 21 రోజుల నిరీక్షణ అనంతరం మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు మొదలై.. ఫలితాలు వెలువడే వరకు నిరంతరాయంగా సాగనుంది. చిత్తూరులోని ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంగా ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ క్షణాల కోసం అభ్యర్థులతో పాటు ఆయా పార్టీల నేతలు, శ్రేణులు, ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

తెల్లవారుజామున 5 గంటలకే రాండమైజేషన్

ఓట్ల లెక్కింపు ప్రక్రియకు నియమితులైన 912 మంది సిబ్బందికి ఆదివారం రెండో విడత రాండమైజేషన్‌గా నియోజకవర్గాలను కేటాయించారు. కలెక్టర్ షన్మోహన్.. ఎన్నికల పరిశీలకుల సమక్షంలో మంగళవారం తెల్లవారుజామున 5గంటలకు మూడో విడత రాండమైజేషన్ చేసి.. టేబుళ్లను కేటాయిస్తారు.

2 వేల మంది ఏజెంట్లు..

ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్ల వంతున.. ప్రతి టేబుల్ వద్ద ఒక్కో అభ్యర్థికి ఒక్కో ఏజెంట్‌ను అనుమతిస్తారు. స్వతంత్ర అభ్యర్థులు పూర్తి స్థాయిలో ఏజెంట్లను నియమించుకోలేరు. అందుకని వారి బదులు కూటమి, వైసీపీ వారే తమకు అనుకూలమైనవారిని నియమించుకున్నారు. సుమారు 2 వేల మంది ఏజెంట్లకు అధికారులు పాసుల్ని జారీ చేశారు.

చిత్తూరుకు తరలివచ్చిన నేతలు, ఏజెంట్లు

కౌంటింగ్ ఏజెంట్లు మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకే కేంద్రంలోకి చేరుకోవాలి. దీంతో జిల్లాలోని ఓ పార్లమెంటు, ఏడు అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన ఏజెంట్లతో పాటు నేతలూ సోమవారం రాత్రికే చిత్తూరు చేరుకున్నారు. దీంతో నగరంలోని అన్ని లాడ్జీలు, హోటళ్లు నిండిపోయాయి.

సిబ్బంది ఆలస్యంగా వస్తే సస్పెన్షన్

కౌంటింగ్ సిబ్బంది మంగళవారం ఉదయం విధులకు ఆలస్యంగా వస్తే తక్షణమే సస్పెండ్ చేస్తామని జేసీ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం ఎస్వీసెట్‌లో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ లెక్కింపు కేంద్రానికి సంబంధించిన సిబ్బందికి రెండో విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జాగ్రత్తగా చేయాలని, ఏజెంట్లతో గొడవలకు దిగొద్దని సూచించారు.

ఒక్కో రౌండ్ లెక్కింపునకు 25 నిమిషాలు

ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లను ఏర్పాటు చేయగా.. అక్కడి పోలింగ్ కేంద్రాలను బట్టి రౌండ్ల సంఖ్య మారుతుంది. పలమనేరు 21, జీడీనెల్లూరు, పుంగనూరు, పూతలపట్టు 19 చొప్పున, కుప్పం 18, చిత్తూరు, నగరి 17 రౌండ్ల వంతున లెక్కిస్తారు. ఒక్కో రౌండ్ కౌంటింగ్‌కు 25 నిమిషాలు పడుతుందని అధికారులు భావిస్తున్నారు. తుది ఫలితాలు అధికారికంగా వెలువడేందుకు సాయంత్రం 4 గంటలు కావచ్చని అంచనా. గెలిచిన అభ్యర్థులకు ఆర్వోలు అక్కడే ఎన్నిక పత్రం అందిస్తారు.





కౌంటింగ్ జరిగే ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద సూచిక బోర్డుల ఏర్పాటు - పుంగనూరు నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రంలోపల ఏర్పాట్లు

ఏజెంట్లతో అభ్యర్థుల సమావేశాలు

ఓట్ల లెక్కింపు కేంద్రా ల్లో ఏజెంట్లు ఎలా వ్యవహరించాలో టీడీపీ అభ్యర్థులు సోమవారం సూచనలు చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో పూతలపట్టు అభ్యర్థి మురళీమోహన్, పలమనేరులో మాజీ మంత్రి అమరనాథరెడ్డితో పాటు ఆయా ప్రాంతాల్లో అభ్యర్థులు ఏజెంట్లకు శిక్షణనిచ్చారు. రూల్స్ ప్రకారం వెళ్లే వాళ్లు కాకుండా.. నిలదీసే వాళ్లే ఏజెంట్లుగా ఉండాలంటూ ఇటీవల వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో వీరంతా అప్రమత్తమయ్యారు. తమ ఏజెంట్లతో సమావేశాలను ఏర్పాటుచేసి.. లెక్కింపు సమయంలో ఎంత అప్రమత్తంగా ఉండాలి.. అభ్యంతరం వ్యక్తం చేయాలంటే ఎవరిని సంప్రదించాలి.. వైసీపీ అడ్డంకుల్ని ఎలా ఎదుర్కోవాలి.. అని దిశానిర్దేశనం చేశారు.

తొలి ఫలితం నగరి, చిత్తూరుదే

ఎన్నికలు జరిగిన ఏడు నియోజకవర్గాల్లో తొలి ఫలితం నగరి లేదా చిత్తూరుది కానుంది. పోలింగ్ కేంద్రాలు చిత్తూరులో తక్కువగా (226) ఉన్నాయి. 13 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. చిత్తూరు కంటే నగరిలో ఐదు కేంద్రాలు ఎక్కువగా (231) ఉండగా.. పోటీలో ఏడుగురు అభ్యర్థులే ఉన్నారు. అన్ని అనుకూలిస్తే నగరిదే తొలి ఫలితం కానుంది. నిమిషాల వ్యవధిలో ఈ రెండు నియోజకవర్గాల ఫలితాలు తేలనున్నాయి.

తొలుత సర్వీసు ఓట్లు.. ఆ తర్వాత పోస్టల్ బ్యాలెట్

తొలుత సైనిక దళాల్లో పనిచేసే సర్వీసు ఓటర్లకు సంబంధించి ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మీటర్ పోస్టల్ బ్యాలెట్ (ఈటీపీబీ) సిస్టమ్‌లో వచ్చిన ఓట్లను లెక్కిస్తారు. మన జిల్లా నుంచి 3991 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. జిల్లా కేంద్రానికి 1005 ఓట్లకు సంబంధించిన కవర్లు కలెక్టరేట్‌కు వచ్చాయి. సర్వీసు ఓట్ల లెక్కింపు తర్వాత ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్లు లెక్కించి.. అనంతరం ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు.

లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వని 150 మందికి పెన్షన్ కట్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 3: వివిధ కారణాలతో లైఫ్ సర్టిఫికెట్లు అందించని విశ్రాంత ఉద్యోగుల్లో 150 మందికి జూన్ 1న అందాల్సిన మేనెల పెన్షన్‌ను ప్రభుత్వం నిలుపుదల చేసింది. ఆన్‌లైన్ ద్వారా సబ్‌ట్రెజరీ కార్యాలయాల్లో లైఫ్‌సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ప్రభుత్వం మార్చి 29 చివరి తేదీగా గతంలో ప్రకటించింది. జిల్లాలో 12,505 మంది పెన్షనర్లు ఉన్నారు. వీరిలో గడువు ముగిసే నాటికి 12వేల మంది జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు అందించారు. మార్చి 1 నుంచి యాప్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణ ఆగిపోయింది. మిగిలిన వారు నేరుగా సబ్‌ట్రెజరీ కార్యాలయాల్లో లైఫ్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతిస్తూ మార్చి 31వ తేదీవరకు గడువు ఇచ్చింది. దీంతో 350 మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగా, ఏప్రిల్ 1న వారికి మార్చినెల పెన్షన్లు పడ్డాయి. కాగా 150 మంది కదల్లేని స్థితిలో ఉండగా, మరికొందరు విదేశాల్లో ఉన్నారు. వీరందరూ మేనెల 31వ తేదీవరకు కూడా లైఫ్‌సర్టిఫికెట్ అందించకపోవడంతో ప్రభుత్వం వీరి పెన్షన్ ఆపింది. వీరంతా సమీప ఎస్టీవో కార్యాలయానికి వెళ్లి లైఫ్ సర్టిఫికెట్ ఇస్తే జూన్ నెలలో పెన్షన్ వచ్చే అవకాశం ఉందని ఖజానాశాఖ డిప్యూటీ డైరక్టర్ రామచంద్ర తెలిపారు.

నిఘా నీడలో జిల్లా

● 260 సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెట్లు

● సంఘటనా స్థలానికి ఐదు నిమిషాల్లో పోలీసులు చేరుకునేలా చర్యలు

డయల్ 100, 112 లేదా 94409 00005

ఎక్కడైనా గొడవల జరిగితే పోలీసులకు చేయాల్సిన ఫోను నెంబర్లు. ప్రజల వివరాలు గోప్యంగా ఉంచుతారు.

చిత్తూరు, జూన్ 3: కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడా గొడవలు జరగకుండా నిఘా ఉంచారు. 260 సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెట్లు ఏర్పాట్లు చేశారు. ఎక్కడైనా అల్లర్లు లేదా ఘర్షణలు జరిగితే ఐదు నిమిషాల్లోపు పోలీసు బలగాలు అక్కడికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. వారం రోజులుగా సమస్యాత్మక ప్రాంతాల్లోని ప్రజలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పోలీసు పికెట్ ఉన్న గ్రామాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. ఎక్కడైనా గొడవలు జరిగితే నేరుగా పోలీసు స్టేషనుకు వెళ్లి సమాచారం ఇవ్వలేని పక్షంలో డయల్ 100, 112 లేదా 94409 00005 నెంబర్లకు సమాచారం ఇవ్వాలి. ఇలా సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. కాగా, ప్రజలు ఇచ్చిన సమాచారం కంట్రోల్ రూము నుంచి నేరుగా ఆయా పోలీసు స్టేషన్లకు చేరుతుంది. దాంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంటారు. జిల్లాకు ఐదు క్యూఆర్టీ వాహనాల్లో రెండింటిని కౌంటింగ్ కేంద్రం వద్ద ఉంచగా మిగిలిన మూడు వాహనాలు జిల్లా అంతటా తిరుగుతుంటాయి. ముఖ్యంగా ఘర్షణలు తలెత్తే గ్రామాలపై క్యూఆర్టీ పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు.



ఎస్వీసెట్ వద్ద పోలీసు పికెటింగ్



ఎస్వీసెట్ కళాశాల వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన ముళ్లకంచె

కౌంటింగ్ కేంద్రం భారీ బందోబస్తు

ఓట్లను లెక్కించే ఎస్వీసెట్ కళాశాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇక్కడ్నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోనే ట్రాఫిక్‌ను మళ్లించారు. ఎస్వీసెట్ కళాశాలను పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. మురకంబట్టు జంక్షన్, పూతలపట్టు కాణిపాకం ఆర్చి, ఇరువారం జంక్షన్, సాంబయ్యకండ్రిగ వద్ద పికెట్లు ఏర్పాటు చేశారు. అనుమతి లేని వాహనాలను తిప్పి పంపేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాలకు సమీపంలో క్యూఆర్టీ, వజ్రా, ఇతర పోలీసు వాహనాలను అందుబాటులో ఉంచారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లే.. తిరిగి వచ్చే దారుల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ మూడంచెల భద్రతను.. ప్రహరీచుట్టూ ఇనుపకంచెను ఏర్పాటు చేశారు. టీడీపీకి చెందిన పలువురు అభ్యర్థులు మంగళవారం కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

గంజాయి విక్రేత అరెస్టు

● రూ. 50వేల విలువ చేసే మూడు కిలోల గంజాయి సీజ్


గంజాయి, నిందితుడ్ని మీడియాకు చూపిస్తున్న సీఐ ఉలసయ్య

చిత్తూరు, జూన్ 3: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ ఉలసయ్య వివరాల మేరకు నగరంలోని వీరభద్రకాలనీలో గంజాయి అమ్ముతున్నాడని పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ ఇక్బాల్, సిబ్బందితో కలిసి మంగళవారం నీవానది ఒడ్డున దాడులు నిర్వహించి షణ్ముగం(32) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. రూ. 50వేల విలువ చేసే మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడ్ని రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఇప్పటికే మూడు కేసులు నమోదుకాగా తాజాగా రౌడీ షీట్ ఓపెన్ చేసినట్లు సీఐ తెలిపారు. గంజాయిని పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన అధికారులు, సిబ్బందిని డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి అభినందించారని సీఐ తెలిపారు.

బావిలో పడ్డ జింక

● కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



జింకను బావిలోనుంచి వెలికి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఇన్‌సెట్‌లో) బయటపడ్డ జింక

కుప్పం, జూన్ 3: వంద అడుగుల లోతు గల ఎండిపోయిన బావిలో పడిన జింకను కుప్పం అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. కుప్పం మండలం గణేశ్‌పురం మలుపు వద్ద కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీంపలోని ఓ ఎండిన బావిలో ఒక అడవి జింక ప్రమాదవశాత్తు పడిపోయింది. స్థానికులు కొందరు ఈ విషయం గురించి కుప్పం అగ్నిమాక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపకాధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వారిలో ఇద్దరు బావిలోకి దిగి, తాళ్ల సాయంతో జింకను వెలికి తీసి ప్రాణాలు కాపాడారు. అనంతరం జింకను అటవీ శాఖాధికారులకు అప్పగించారు.

ఒంటరి ఏనుగు బీభత్సం



కల్లూరు, జూన్ 3: పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కోటపల్లి సమీపంలో ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగు మామిడి చెట్లను ధ్వంసం చేసింది. దాదాపు 10 చెట్లను విరిచేసింది. సుమారు అర టన్ను మామిడికాయలు నేలరాలాయి. కోటపల్లికి చెందిన రైతు దామోదర్‌నాయుడుకు చెందిన మామిడి తోటలోకి ఆదివారం రాత్రి చొరబడిన ఒంటరి ఏనుగు బీభత్సం చేసింది.

అగ్రిలో డిప్లొమా కోర్సులకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి రూరల్, జూన్ 3: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలో నిర్వహించే వ్యవసాయ డిప్లొమా కోర్సులకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.రమణ తెలిపారు. పదో తరగతి విద్యార్హతతో ప్రవేశాలు కల్పించే ఈ కోర్సులకు ఈనెల ఒకటో తేదీనుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, ఇదేనెల 20వ తేదీవరకు గడువుందని చెప్పారు. ఇంటర్ ఫెయిలైన వారు కూడా దరఖాస్తు చేయవచ్చని, 2024 ఆగస్టు 31వ తేదీనాటికి 15-22 ఏళ్ల మధ్య వయసున్నవారు అర్హులని తెలిపారు. గ్రామీణ, మున్సిపల్ పాఠశాలల్లో చదివిన వారికి 75:25 నిష్పత్తిలో సీట్ల కేటాయింపు ఉంటుందని చెప్పారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్‌ని సంప్రదించాలని కోరారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తదితరాలకు 0877-2249909, 96181 67187 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని సూచించారు.

జోనల్‌స్థాయి ఫుట్‌బాల్ విజేతగా నెల్లూరుజట్టు


రన్నరప్‌గా నిలిచిన తిరుపతి జట్టు

తిరుపతి(క్రీడలు), జూన్ 3: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం తుమ్మలగుంట క్రీడామైదానం వేదికగా జరిగిన జోనల్‌స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో నెల్లూరు జట్టు విజయం సాధించింది. ఈ పోటీలకు కోరమండల్ జోనల్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచి ఫుట్‌బాల్ జట్లు ప్రాతినిధ్యం వహించాయి. రౌండ్‌రాబిన్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహించగా, తుదిపోరులో నెల్లూరు, తిరుపతి జట్లు తలపడ్డాయి. ఇందులో విజేతగా నిలిచిన నెల్లూరు జట్టుకు ట్రోఫీ, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ జట్టు ఈనెల 6నుంచి విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. తిరుపతి జట్టు రన్నరప్‌గా సరిపెట్టుకుంది. ముఖ్యఅతిథిగా జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్ హాజరై ప్రసంగిస్తూ ఫిట్‌నెస్‌ను మెరుగుపరుచుకుని గొప్ప ఆటగాళ్లుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రెడ్డెప్ప, శ్రీనివాసులు, ప్రభాకర్, వినోద్, రమేష్, రాజీవ్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి పట్టిన దరిద్రాన్ని దేవుడు తొలగిస్తాడు

- ఎంపీ రేణుకా చౌదరి

తిరుమల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఏపీకి మంచిరోజులు వస్తున్నాయని, రాష్ట్రానికి పట్టిన దరిద్రాన్ని దేవుడు తొలగిస్తాడని ఎంపీ రేణుకా చౌదరి అన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. 2000 నుంచి ఎగ్జిట్‌పోల్స్ ఎన్నిసార్లు తప్పులు చెప్పాయో అందరూ గ్రహించాలని చెప్పారు. కాంగ్రె‌స్‌కి చెందిన వారంగా, దేశప్రగతి కోసం సేవ చేస్తున్నామన్నారు. దేశ ప్రజలందరూ బాగుండాలని, ముఖ్యంగా రైతులకు మంచి పంటలు పండి ఆరోగ్యంగా, ధైర్యంగా ఉండేలా స్వామి దీవిస్తారని ఆశిస్తున్నానన్నారు.

పరిషత్‌కు పంపుతారనే వార్తలు వదంతులే

- నటి సుమలత



తిరుమల, జూన్3 (ఆంధ్రజ్యోతి): తనను బీజేపీ పరిషత్‌కు పంపాలని చూస్తుందనే వార్తలు వదంతులు మాత్రమేనని నటి సుమలత వివరణ ఇచ్చారు. ఆ సీటు వేరే వాళ్లకు కూడా ప్రకటించారని తెలిపారు. ప్రస్తుతం తాను స్టేట్ పాలిటిక్స్ వైపు చూడటం లేదన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రాజ్యసభ సీటు ఆశిస్తున్నారా అనే ప్రశ్నకు చూద్దామని బదులిచ్చారు. ఖచ్చితంగా కేంద్రంలో బీజేపీనే వస్తుందని ఎగ్జిట్ పోల్స్ చెప్పాయని, అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, మోదీ 0.3ని చూస్తామన్నారు. తన కుమారుడు హీరో అభిషేక్ అంబరీష్, కోడలు, కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. సుమలతతోపాటు నిర్మాత రాక్‌లైన్ వెంకటేష్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి






చిత్తూరులోని ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం కౌంటింగ్ సందర్భంగా ఏర్పాట్లు పూర్తయిన కుప్పం నియోజకవర్గ సర్వీసు ఓట్ల లెక్కింపు కేంద్రం, పూతలపట్టు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కేంద్రం, కౌంటింగ్ కేంద్రం లోపల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య తదితరులు





అడుగడుగునా తనిఖీలు, చిత్తూరులో కౌంటింగ్ కేంద్రం సమీపంలో పోలీసుల పహారా, మురకంబట్టు సర్కిల్ వద్ద పోలీసు పికెట్

ప్రశాంత కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

● జిల్లా అంతటా 144 సెక్షన్
● పోలీసు అధికారుల సమావేశంలో ఎస్పీ మణికంఠ


పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, జూన్ 3: ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహిస్తున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ను సజావుగా, పారదర్శకంగా జరిపించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. ఓట్ల లెక్కింపుపై ఎస్వీసెట్ కళాశాల సమావేశపు హాలులో సోమవారం ఆయన పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. పోలింగ్ రోజున ఎలాగైతే విధులు నిర్వహించారో... కౌంటింగ్ రోజున అదే ఒరవడిని కొనసాగించి సజావుగా జరిగేలా చూడాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎంట్రెన్స్, ఎగ్జిట్ల వద్ద ఏర్పాటు చేసిన యాక్సెస్ కంట్రోల్ ద్వారా క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే కౌంటింగ్ సిబ్బందిని, ఏజెంట్లను, అధికారులను లోపలకు అనుమతించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలు, రహదారుల వద్ద కట్టుదిట్టమైన నిర్బంధాన్ని అమలు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులు సంచరించకుండా నిఘా ఉంచాలన్నారు. కమ్యునికేషన్ వ్యవస్థలను వినియోగించుకోవాలన్నారు. పోలీసులకు నిర్దేశించిన పాయింట్లలో ఎలాంటి అలసత్వం వహించకుండా విధులు నిర్వహించాలన్నారు.

ప్రజలూ సహకరించండి

జిల్లా అంతటా 144 సెక్షన్, 30 యాక్టు అమలులో ఉన్నందున ముగ్గురికి మించి ఎక్కువ మంది గుమికూడితే చర్యలు తప్పవని ఎస్పీ మణికంఠ హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమన్నారు. క్యూఆర్టీ వాహనాలు నిరంతరం తిరుగుతూ ఉంటుందని, వాటి సీసీ కెమెరా ఫుటేజీలో రికార్డు అయిన దృశ్యాల ద్వారా చట్టపర చర్యలు తీసుకుంటామన్నారు. లెక్కింపు రోజున అమలులో ఉన్న ఆంక్షలు, మార్గదర్శకాలను తెలుసుకుని ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు అరీఫుల్లా, నాగేశ్వరరావు, డీఎస్పీలు రాజగోపాల్‌రెడ్డి, శ్రావన్‌కుమార్, ఇలియాస్ బాషా, పవన్‌కుమార్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

భర్త వేధింపులతోనే వేదవతి ఆత్మహత్య

మృతురాలి తల్లిదండ్రుల ఆరోపణ ● దస్తగిరికి దేహశుద్ధి చేసిన మహిళలు ● భీమగానిపల్లెలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు


వేదవతి మృతదేహం వద్ద పోలీసుల గౌరవ వందనం

పుంగనూరు, జూన్ 3: భర్త దస్తగిరి వేధింపులతోనే తమ బిడ్డ వేదవతి ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీసు జిల్లా కార్యాలయంలో ఆదివారం సాయంత్రం గన్‌తో కాల్చుకుని మహిళా కానిస్టేబుల్ వేదవతి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. రాయచోటి ఏరియా ఆస్పత్రి నుంచి ఆమె మృతదేహాన్ని తల్లిదండ్రులు గంగాధర్, రాఘవమ్మ, పోలీసులు పుంగనూరు మండలం భీమగానిపల్లెకి సోమవారం మధ్యాహ్నం తీసుకొచ్చారు. మృతురాలి భర్త దస్తగిరి కూడా రావడంతో గ్రామంలోని మహిళలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్యాయంగా తమ బిడ్డను పొట్టనపెట్టుకుని పసిబిడ్డను అనాథను చేశావంటూ దేహశుద్ధి చేశారు. వేదవతి కుమార్తె షఫీనా(5)ను అంత్యక్రియలకు తీసుకురాకుండా మదనపల్లెలోని దస్తగిరి అమ్మవద్ద విడిచి రావడంపై ఆగ్రహించారు. తమకు బిడ్డను అప్పగించే వరకు అంత్యక్రియలు చేయబోమని భీష్మించారు. భర్త కొట్టడం, హింసించడం వల్లే తమ బిడ్డ చనిపోయిందని, వేదవతి ఉద్యోగం భర్తకు ఇవ్వొద్దని, పసిబిడ్డను తమకు అప్పగించాలని రాయచోటి నుంచి వచ్చిన ఏఆర్ డీఎస్పీ, పోలీసులను కోరారు. వివాహం చేసుకునేటప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని, ఇప్పుడు మాట్లాడితే ప్రయోజనం ఏమిటని, ముందే జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పోలీసులు సర్దిచెప్పారు. మదనపల్లెనుంచి షహీనాను పోలీసులు తీసుకొచ్చారు. గంగాధర్ ఇంటి వద్ద పోలీసులు వేదవతి మృతదేహానికి గౌరవవందనం చేసి పూలమాలలతో నివాళులర్పించారు. 'కూలిపనులు చేసి వేదవతిని చదివించాం. పుంగనూరులో 9 నెలలు కోచింగ్‌కు పంపితే ముందే పెళ్లి చేసుకుని బిడ్డ ఉన్న వ్యక్తి మాటలకు మోసపోయి జీవితం నాశనం చేసుకుంది. చాలా మంచోడని వెళ్లింది. అతడికి ముందే పెళ్లయిన విషయం తెలిసి సంవత్సరం తర్వాత ఫోన్ చేసింది ఏడ్చింది. భార్య జీతం, లోన్లు తింటూ నరకం చూపించాడు. మూడునెలల క్రితం ఫోన్‌చేసి నన్ను కొడుతున్నాడని, చాలా ఇబ్బందిపడుతున్నానని, నేను వచ్చేస్తానని చెబితే వచ్చేయమన్నాం. పెళ్లి కావాల్సిన సోదరికి ఇబ్బందని ఆలోచించి పుట్టింటికి రాకుండా ఇబ్బంది పడింది. గతంలో ఒకసారి మావద్దకు వచ్చినందుకు దస్తగిరి గొడవ చేశాడు. రాయచోటిలో వేదవతి శవాన్ని కూడా ఇవ్వమని చెప్పారు. మేము ఒక్క రూపాయి జీతం కూడా తినలేదు. బిడ్డకు టెంకాయ కొట్టుకునేందుకు తీసుకెళతామని పట్టుబడితే ఇచ్చారు' అంటూ తల్లి రాఘవమ్మ రోదించారు. వివిధ గ్రామాలకు చెందిన మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. శ్మశానం వద్ద రాయచోటి పోలీసులు మరోసారి వేదవతి మృతదేహానికి గౌరవవందనం చేసి, గాలిలోకి మూడురౌండ్ల కాల్పులు జరిపి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించారు. కాగా, వేదవతి భర్త దస్తగిరికి గ్రామస్తులు దేహశుద్ధి చేయడంతో అతడు అంత్యక్రియల్లో పాల్గొనకుండా వెళ్లిపోయాడు.

మామిడి కాయలకు రక్షక కవచం

అధిక ధరలతో లాభాల బాటలో రైతన్న


సోమల మార్కెట్‌లో రక్షక కవచం ఉన్న మామిడిని ప్యాకింగ్ చేస్తున్న కూలీలు

సోమల, జూన్ 3: మామిడి కాయలకు రక్షక కవచం తొడగడంతో మార్కెట్‌లో అధిక ధరలు పలుకుతున్నాయి. కిలోకు రూ.22 అదనంగా పొందుతున్నారు. సోమల మండలంలో పలువురు రైతులు మామిడి తోటల్లో దిగుబడులు వచ్చిన వెంటనే కాయలు ఒక సైజుకు వచ్చినప్పుడు ఈ రక్షక కవచాలను కాయలకు కడుతున్నారు. దీంతో కాయలు కోత సమయంలో అధిక ధరలు పలుకుతున్నాయి. సోమల మార్కెట్‌లో సోమవారం బేనిషా రకం కిలో రూ. 50 పలకగా, రక్షక కవచం ఏర్పాటు చేసిన కాయలకు అదనంగా రూ.22 చెల్లించారు. దీంతో కిలో రూ. 72 పలికింది. మల్లికా రకం రూ. 65, తోతాపురి కిలో రూ. 57కు చేరుకుంది. రక్షక కవచం కట్టడంతో మామిడి కాయలకు పురుగుల బెడద లేకుండా చూసుకోవడంతో పాటు వీటికి వర్షంతో దెబ్బతినకుండా ఉంటుంది. గాలి వానలకు రాలకుండా ఉంటుంది. వాతావరణ పరిస్థితులను తట్టుకుంటుంది. కాయలు నాణ్యతతో ఉండడం రైతులు ఉత్సాహం చూపుతున్నారు. సోమల మండలంలోని పలువురు రైతులకు పలు మామిడి సొసైటీలు సబ్సిడీ ధరలకు అందజేశారు. ఒక్కో రక్షక కవర్ రూ.1.80 కి, రూ.2 విక్రయించారు. వీటిని రైతులు తమ తోటల్లోని కాయలకు కట్టడానికి ఒక్క రూపాయి, రూ.1.50 వంతున చెల్లించారు. కోత సమయంలో వీటికి ప్రత్యేక ధర రావడంతో కవర్లు కట్టడానికి ఉత్సాహం చూపుతున్నారు. ఉద్యానశాఖ సబ్సిడీతో అందజేస్తామని ప్రకటించినా సకాలంలో రైతులకు అందజేయలేక పోయారు. అధికారులు స్పందించి రాబోవు మామిడి సీజన్‌కు రాయితీ ధరతో రైతులకు రక్షక కవర్లు అందజేయాలని కోరుతున్నారు.

సకల శుభాలకు మూలం ఆంజనేయస్వామి ఉపాసన

స్వస్వరూపానందగిరి స్వామి

తిరుమల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సకల దేవతల ఆరాధనకు హనుమంతుడిని ఆశ్రయించడం ఒక్కటే మార్గమని, తద్వారా సకల శుభాలు చేకూరుతాయని శ్రీనివాసమంగాపురం వశిష్టాశ్రమ లలితా పీఠం వ్యవస్థాపక పీఠాధిపతి స్వస్వరూపానందగిరి స్వామి ఉద్ఘాటించారు. హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తిరుమలలోని నాదనీరాజనం, ఆకాశగంగ, జపాలి తీర్థంలో నిర్వహించిన ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా నాదనీరాజనం వేదికపై స్వస్వరూపానందగిరి స్వామి అనుగ్రహభాషణం చేస్తూ రామ నామాన్ని ఎవరైతే జపిస్తారో వారందరినీ హనుమంతుడు అనుగ్రహిస్తారని, తులసీదాసు తదితర మహనీయుల చరిత్రను వివరించారు. ఆకాశగంగలో ఉదయం 10 గంటలకు జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం అధ్యాపకులు ఆచార్య రాఘవాచార్యులు హనుమంతుడి జన్మ విశేషాలు తెలిపారు. జపాలిలో ఉదయం 8 గంటలకు తిరుపతికి చెందిన ఉదయ్ భాస్కర్ బృందం హనుమాన్ చాలీసాను పఠించారు. తర్వాత ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు వందన బృందం ఎందరో మహానుభావులు.., అంజనేయ జగదేక వీర.., బంటు రీతి కొలువు ఈయవయ్య రామా.., వంటి కీర్తలను ఆలపించారు. అనంతరం తిరుపతికి చెందిన ప్రసన్నలక్ష్మి బృందం హనుమాన్ చాలీసా పఠించారు. అలాగే అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు లలిత శివజ్యోతి బృందం గ్రాత కచేరి నిర్వహించారు.

బాలాంజనేయస్వామికి పుష్పార్చన

హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుమలలోని ఆకాశ గంగలో అంజనాదేవి సమేత బాలాంజనేయస్వామికి సోమవారం ఉదయం కనకాంబరం, సింధూర వర్ణ గన్నేరి పుష్పాలతో విశేష సహస్ర నామార్చనను అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా టీటీడీ వైఖానస ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు అంజనాద్రి, ఆకాశగంగ ఆంజనేయస్వామి జన్మస్థల, స్వామి వైభవం గురించి వివరించారు. అనంతరం స్వామికి పంచామృత తిరుమంజనం జరిగింది. టీటీడీ అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

చిత్తూరు సిటీ, జూన్ 3: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఈఎస్ ఆయేషా బేగం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 3, 4, 5 తేదీల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్‌లు, క్లబ్‌లు, టూరిజం బార్లు, మిలిటరి క్యాంటీన్, కల్లు దుకాణాలు మూసివేయాలన్నారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మద్యం విక్రయాలు జరిపితే లైసెన్సులు రద్దుచేస్తామని హెచ్చరించారు.

బోసిపోయిన కలెక్టరేట్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 3: గత 40 రోజులుగా ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమైన కలెక్టరేట్ సిబ్బంది.. చివరి ఘట్టమైన ఓట్ల లెక్కింపు కోసం 24 గంటల ముందే ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రానికి తరలివెళ్లారు. కౌంటింగ్ కోసం జిల్లా ఎన్నికల విభాగం సుమారు 1200 మంది సిబ్బందిని అన్ని పనులకు నియమించగా, వారిలో 150 మంది కలెక్టరేట్ సిబ్బందిని చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ సర్వీసు ఓట్ల లెక్కింపు, ఇతర లెక్కింపు పనులకు కలెక్టర్ షన్మోహన్ నియమించారు. దీంతో అన్ని కీలక విభాగాల్లోని అధికారులు, సిబ్బంది ఎస్వీసెట్‌కు వెళ్లడంతో కలెక్టరేట్ బోసిపోయింది. పనుల కోసం వచ్చిన చాలామంది వెనుదిరిగి వెళ్లారు.

పలకరించిన నైరుతి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 3: గత నెలరోజులుగా వడగాల్పులతో అల్లాడిన జనం నైరుతి రుతుపవనాల పలకరింపుతో పులకరించారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు 18 మండలాల్లో తేలికపాటి నుండి బలమైన వర్షం కురిసింది. మండలాలవారీగా... రామకుప్పంలో 50.4, పుంగనూరులో 38.4, బైరెడ్డిపల్లెలో 32.8, గంగవరంలో 30.4, పెద్దపంజాణిలో 27.2, శాంతిపురంలో 25.2, కుప్పంలో 16.4, పెనుమూరులో 16.0, గుడుపల్లెలో 14.6, పలమనేరులో 12.8, బంగారుపాళ్యంలో 10.2, నగరిలో 6.8, చిత్తూరు రూరల్‌లో 4.2, జీడీనెల్లూరులో 3.4, సదుంలో 3.2, రొంపిచెర్లలో 1.4, వెదురుకుప్పంలో 1.4, పూతలపట్టులో 1.2 మిమీ వర్షం కురిసింది.

కొన్నిశాఖల ఉద్యోగులకే జీతాలు

● పెన్షనర్లకు నిరాశే!

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 3: ప్రభుత్వ ఉద్యోగులకు జీతాల సమస్య ఇంకా కొలిక్కి రాలేదు. తొలిరోజే అందుతాయని ఆశించినవారికి నిరాశే ఎదురైంది. కొత్త ప్రభుత్వం ఏర్పడే విషయంలో ప్రస్తుత ప్రభుత్వం ఒకటో తేదీనే జీతాలు వేస్తుందని ఆశపడ్డ ప్రభుత్వ ఉద్యోగులకు ఎదురుచూపులే మిగిలాయి. గతంలో మాదిరిగానే ఎప్పుడు పడతాయో ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోమవారం కలెక్టరేట్, రెవెన్యూ, పోలీసు, వైద్య, ఆరోగ్య, న్యాయ, ఖజానాశాఖ ఉద్యోగులకు మాత్రమే జీతాలు పడగా, మెజార్టీ ఉద్యోగులున్న శాఖలకు మాత్రం ఇంకా జీతాలు అందని పరిస్థితి. జిల్లాలో ఉన్న 12,505 మంది పెన్షనర్లకు కూడా వారి బ్యాంకు ఖాతాల్లో పెన్షన్లు జమకాలేదు. ఒకటో తేదీ నే పెన్షన్లు పడతాయని ఆశించినా... జగన్ సర్కార్ అం దుకు భిన్నంగా వ్యవహరించడంతో పెన్షనర్లు మండిపడుతున్నారు. ఉపాధ్యాయుల జీతాల విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

శాంతిభద్రతల పట్ల అప్రమత్తంగా ఉండాలి



పలమనేరు పోలీసు స్టేషన్ వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ చంద్రశేఖర్

పలమనేరు, జూన్3 : ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా పలమనేరులో శాంతి భద్రతల పరిరక్షణ పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని పలమనేరు సీఐ చంద్రశేఖర్ సూచించారు. సోమవారం పలమనేరు పోలీసుస్టేషన్ వద్ద మంగళవారం పలమనేరులో విధులు నిర్వహించనున్న సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలమనేరులో పోలీస్-30 యాక్టు, 144 సెక్షన్ అమలులో ఉన్నాయన్నారు. అందువల్ల నలుగురు కంటే ఎక్కువ మంది ప్రజలు గుమికూడకుండా చూడాలన్నారు. మంగళవారం పట్టణంలోని హోటళ్లు, దుకాణాలు మూసివేయాలని సూచించారు.

శాంతిపురంలో 144 సెక్షన్ అమలు

శాంతిపురం, జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో శాంతిపురం మండలంలో మంగళవారం 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని రాళ్లబూదుగురు ఎస్ఐ సుమన్ హెచ్చరించారు. 30 సెక్షన్ పోలీస్ యాక్ట్ ఉన్నం దున నలుగురు మించి గుమికూడదని, తిరగకూడదని, ఫలితాల తర్వాత సైతం ర్యాలీలు, టపాసులు కాల్చడం వంటివి చేయరాదని స్పష్టంచేశారు. మద్యం సేవించి గొడవలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి



కౌంటింగ్ ఏజంట్లకు సూచనలిస్తున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు, జూన్3: చిత్తూరులో ఓట్లలెక్కింపు సందర్భంగా పార్టీ తరపున పాల్గొనే ఏజెంట్లు అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి సూచించారు. సోమవారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో పోలింగ్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. వారికి దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్ల విషయంలో అధికార వైసీపీ చేసే చర్యలను గమనిస్తూ ఉండాలని, ఎటువంటి అనుమానాలు ఉన్నా వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. ఎటువంటి పరిస్థితిలోను నిబంధనలు ఉల్లంఘించవద్దని, అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు అందరూ సంయమనం పాటించాలన్నారు.

కుప్పంలో పోలీసులు సన్నద్ధం



కుప్పంలో మోహరించిన పోలీసులు

కుప్పం, జూన్ 3: కుప్పంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు సన్నద్ధమయ్యారు. కౌంటింగ్ సందర్భంగా నియోజకవర్గంలో ఎటువంటి అల్లర్లు చోటు చేసుకోకుండా తగి చర్యలు తీసుకోవడానికి అవవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రజలకు భరోసా ఇవ్వడానికి సోమవారం పట్టణంలో మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. నియోజకర్గపరిధిలోని పోలీసులు కాకుండా, వివిధ పోలీసు విభాగాలకు చెందిన 120 మంది బలగాలను అదనంగా కుప్పానికి ఎస్పీ కేటాయించారు. నియోజకవర్గంలోని సున్నితమైన ప్రాంతాలను ఇప్పటికే గుర్తించిన పోలీసులు, ఆయా చోట్ల అవసరమైన నిఘాను ఏర్పాటు చేశారు. కౌంటింగ్‌ను పురస్కరించుకుని కుప్పంలో 30 పోలీసు యాక్ట్‌తోపాటు, 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసు అధికారులు తెలిపారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించడానికి ప్రయత్నిస్తే అటువంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం



గుడుపల్లె, జూన్ 3: మండలంలోని కుప్పిగానిపల్లెలో శివపార్వతుల కల్యాణం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. కుప్పిగానిపల్లె గ్రామంలో వెలసిన పెద్దపల్లె గంగమ్మ ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఉదయం అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి అమ్మవారిని రంగురంగు పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి శివపార్వతుల ఉత్సమూర్తులను పట్టువస్త్రాలు, పూలతో అలంకరించారు. గ్రామంలోని మహిళలు ఫల, పుష్ప తాంబూలాలతో ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. ఆ తరువాత వేద పండితులు సోమశేఖర్ ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. మహిళలు స్వామివారికి హారతులిచ్చి మొక్కుకున్నారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సల్లాపురమ్మ ఆలయంలో విశేషపూజలు





పసుపునీటి బిందెలతో ఆలయ ప్రదక్షిణచేస్తున్న మహిళలు,
అమ్మవారికి పసుపు,కుంకుమ నీటితో అభిషేకం చేస్తున్న అర్చకులు

భైరెడ్డిపల్లె, జూన్ 3 : భైరెడ్డిపల్లె పట్టణంలోవున్న సల్లాపురెమ్మ ఆలయ ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు ముని వీరయ్య, వీభద్రయ్య, నాగేంద్రప్రసాద్ అమ్మవారికి పసుపు,కుంకుమనీటితో పాటు పాలాభిషేకంచేసి పుష్పార్చన, సహస్రదీపాలంకరణసేవ జరిపి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా మహిళలు 108 బిందెలతో పసుపు నీళ్లు తీసుకొచ్చి ఆలయంచుట్టూ ప్రదక్షిణచేసి అమ్మవారికి సమర్పించారు.

ఎన్నికల ఫలితాలపై భారీగా పందేలు

ఐరాల, జూన్ 3: ఎన్నికల ఫలితాలపై ఐరాల మండలంలో కొందరు భారీగా పందేలు కాసినట్లు సమాచారం. కొందరు పార్టీ విజయంపై లక్షల రూపాయల మేర బెట్టింగులు కాశారు. మండల వ్యాప్తంగా సుమారు కోటి రూపాయలకు పైగా బెట్టింగులు జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మామిడి పంటపై వచ్చే ఆదాయాన్ని చూపి వడ్డీలకు డబ్బు తెచ్చి బెట్టింగులు కాశారు. బెట్టింగ్ మొత్తాలను గ్రామంలోని నమ్మకమైన వ్యక్తి వద్ద ఉంచుతున్నారు.

పాము కాటుతో మహిళకు అస్వస్థత

పుంగనూరు రూరల్, జూన్3: పాము కాటుతో ఓ మహిళ అస్వస్థతకు గురైంది. స్థానికుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం చిప్పిరపల్లెకు చెందిన బుడ్డారెడ్డి భార్య సరోజమ్మ(58) పొలం పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులు ఆమె కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వృద్ధురాలి మెడలో బంగారుగొలుసు చోరీ

పుంగనూరు రూరల్, జూన్ 3: సినీ ఫక్కీలో ఓ వృద్ధురాలి మెడలో పట్టపగలే గుర్తుతెలియని దుండగులు బంగారు గొలుసు లాక్కెళ్లారు. ఈ ఘటన సోమవారం పుంగనూరులో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. సోమలకు చెందిన సహదేవరాజు భార్య పద్మావతమ్మ (70) గత శుక్రవారం బెంగళూరు నుంచి సొంతగ్రామానికి చేరుకుంది. తిరిగి బెంగళూరుకు వెళ్లేందుకు పుంగనూరు ప్రైవేట్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా 58 గ్రాముల బంగారు చైన్‌ను గుర్తు తెలియని దుండగులు లాక్కెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సత్యగంగమ్మ హుండీ లెక్కింపు

పలమనేరు, జూన్3 : పలమనేరు పాతపేటలోని సత్యగంగమ్మ హుండీని సోమవారం ఎండోమెంట్ అధికారులు భక్తుల సమక్షంలో లెక్కించారు. భక్తులు రూ. 86,702లు కానుకలు వచ్చాయి. ఈ హుండీ లెక్కింపులో జిల్లా దేవాదాయ కార్యాలయం నుంచి ఇన్‌స్పెక్టర్ రాధ , పలమనేరు ఎండోమెంట్ సిబ్బంది విజయభాస్కర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో వళ్లీ దేవసేన సమేత ుబ్రహ్మణ్యస్వామి

గుడుపల్లె, జూన్ 3: మండల పరిధి లోని గుడివంక కొండపై వెలసిన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి సోమ వారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రంగు రంగుల పుష్పాలతో స్వామి అమ్మ వార్లను అలంకరించారు. ఆ తరువాత భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు. అనంతరం ఉత్సవ మూ ర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. స్వామివారిని ఆలయం చుట్టూ ఊరేగించారు. అనేక గ్రామాల నుంచి వచ్చిన వందలాది మంది భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూరహారతులు పట్టారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం





కౌండింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు, చిత్తూరులో కౌంటింగ్ హాల్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్వో మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు, జూన్ 3: పుంగనూరు నియోజకవర్గం అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఓట్లు లెక్కింపునకు చిత్తూరు ఎస్వీసెట్ కళాశాలలో సర్వంసిద్ధం చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వై.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిత్తూరు ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు, ఈవీఎంల ఓట్ల లెక్కింపు టేబుళ్లను, అధికారులు, ఎన్నికల విధులు నిర్వహించే ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు కూర్చొనే కుర్చీలను, రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్‌లను, ఏజెంట్లు కూర్చోడానికి సిద్ధం చేసిన కుర్చీలను, విద్యుత్ వసతి, సాంకేతికతకు సంబంధించిన ఏర్పాట్లను ఆర్వో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఏజెంట్లు అభ్యర్థుల డిక్లరేషన్, గుర్తింపుకార్డులతో రావాలన్నారు. సెల్‌ఫోన్లు నిషేధ మన్నారు. ప్రశాంతంగా ఓట్లు లెక్కింపు ముగిసేందుకు సహకరించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ శివయ్య, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

చిత్తూరుకు చేరుకున్న ఏజెంట్లు

ఓట్లు లెక్కింపు కేంద్రానికి ఉదయం 7గంటలలోపే చేరుకోవాల్సి ఉంది. దీంతో అన్ని రాజకీయపార్టీల ఎన్నికల ఏజెంట్లు, అభ్యర్థులు సోమవారం సాయంత్రానికే చిత్తూరు చేరుకున్నారు. ఏజెంట్లకు జాగ్రత్తలు తెలియజేసి చివరి వరకు కౌంటింగ్ కేంద్రంలోనే అప్రమత్తంగా ఉండాలని నాయకులు సూచించారు. పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి, వైసీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బీసీవైపీ అభ్యర్థి .బోడే రామచంద్రయాదవ్ తదితర అభ్యర్థుల తరపున కౌంటింగ్‌కు వెళ్లే జనరల్ ఏజెంట్లు, టేబుల్ వారీ ఏజెంట్లు చిత్తూరు చేరుకున్నారు. అలాగే రాజంపేట లోక్‌సభ బీజేపీ అభ్యర్థి. మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి, వైసీపీ అభ్యర్థి ఎంపీ పీవీ.మిథున్ రెడ్డిల తరపున ఎన్నికల ఏజెంట్లు కూడా చిత్తూరు వెళ్లారు.

స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేయాలి

- గొడవలు చేస్తే కఠిన చర్యలు తప్పవు
- ఏఎస్పీ సుబ్బరాజు



పోలీసులకు సూచనలు ఇస్తున్న జిల్లా అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు

పుంగనూరు, జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పుంగనూరులో ఎలాంటి గొడవలు జరగకుండా మంగళవారం స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి సహకరించాలని అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు కోరారు. సోమవారం పుంగనూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించి మంగళ వారం చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 144సెక్షన్‌ను అమలులో ఉందన్నారు. ప్రధా నంగా టీ దుకాణాలు మూసివేయాలన్నారు. పుంగనూరుతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం నలుగురికి మించి గుమికూడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే గెలుపొందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం, టపాసులు కాల్చరాదని స్పష్టం చేశారు. కౌంటింగ్ సమయంలో ఎవరూ ఇతరులను రెచ్చగొట్టేలా వాట్సప్‌లో మెసేజ్‌లు చేయడం, సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టరాదని హెచ్చరించారు. రెచ్చగొట్టే ప్రకటనలు, పోస్టులు, ఫొటోలు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గొడవలు జరగకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెటింగ్‌లు ఉంటాయని, సీఆర్పీఎఫ్ బలగాలు తిరుగుతుంటాయని ఎక్కడ సమస్య తలెత్తినా పోలీసులు చేరుకుంటారని వివరించారు. ఈ సమావేశంలో సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల కోసం పండుటాకుల పడిగాపులు

- రెండో రోజూ బ్యాంకుల వద్ద వృద్ధుల అవస్థలు

పుంగనూరు, జూన్3: ప్రభుత్వం సామాజిక పింఛన్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో వృద్ధులు, వితంతువులు డబ్బుల కోసం సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బ్యాంకుల వద్ద ఇబ్బందులు పడ్డారు. బ్యాంకుల వద్దనే కాకుండా మినీ బ్యాంకుల వద్ద సైతం అవస్థలు పడ్డారు. బ్యాంకులు పింఛను దారులతో కిక్కిరిశాయి.

కల్లూరు: పింఛన్ నగదు తీసుకునేందుకు అవ్వాతాతల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ప్రభుత్వం పింఛన్ నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తోంది. శనివారం ఒకటో తేదీ సాయంత్రం ఖాతాల్లో నగదు జమ అయింది. బ్యాంకు సమయం ముగియడంతో నగదు డ్రాచేసుకోలేని పరిస్థితి. మరుసటి రోజు ఆదివారం బ్యాంకులకు సెలవు. దీంతో సోమవారం అధికమంది పెన్షనర్లు బ్యాంకుల వద్దకు క్యూకట్టారు. పులిచెర్ల మండలం కల్లూరు ఇండియన్ బ్యాంకు వద్ద పింఛన్‌దారులు క్యూ కట్టారు. బ్యాంకు తెరవకముందు నుంచే ఇండియన్ బ్యాంకు బిజినెస్ కరస్పాండెట్ల వద్ద పింఛన్ నగదు కోసం వృద్ధులు నిలుచుని డబ్బు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వికలాంగులు, బ్యాంకు ఖాతాకు ఆధార్ లింకులేని లబ్ధిదారులు, అభయహస్తం లబ్ధిదారులకు మాత్రం సచివాలయ సిబ్బంది ఇంటికెళ్లి పింఛన్ నగదు అందజేశారు. అయితే బ్యాంకు వరకు నడిచి వెళ్లలేని వృద్ధులు సైతం ఇతరుల సాయంతో బ్యాంకుల వద్దకు చేరుకొని పింఛన్ నగదు తీసుకోవాల్సి వస్తోంది.

● బ్యాంకుల వద్ద నరకం చూస్తున్నాం

పింఛన్ నగదు కోసం బ్యాంకుల వద్ద నరకం చూస్తున్నాం. బ్యాంకు వద్ద గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోందని మతుకువారిపల్లికి చెందిన వెంకటమ్మ, యశోదమ్మ, వెంకటదాసరపల్లి పంచాయతీ జూపల్లివారి పల్లికి చెందిన తిరుమలమ్మ వాపోయారు.







పుంగనూరులో బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు, కల్లూరు ఇండియన్ బ్యాంకు సమీపంలో ఎదురుచూస్తున్న వృద్ధులు, నిలుచుకోలేక వేచి ఉన్న వృద్ధులు వెంకటమ్మ, యశోదమ్మ, తిరుమలమ్మ

హనుమంత వాహనంపై వేణుగోపాలుడు

కార్వేటినగరం, జూన్ 3: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం హనుమంతు వాహనంపై స్వామి ఊరేగారు. ఆలయంలో మధ్యాహ్నం స్వామివారికి వసంతోత్సవాన్ని కన్నుల పండుగా వేద పండితులు నిర్వహించారు. అనంతరం మువ్వగోపాలుడు ఊంజల సేవ కార్యక్రమంలో సేద తీరారు. తర్వాత స్వామివారు గజ వాహనంపై పురవీధుల్లో ఊరేగి భక్తుల చేత కర్పూర హారతి నిరాజనాలు అందుకున్నారు.



ఆలయంలో వసంతోత్సవం

సామాలమ్మ గుడిలో టీడీపీ పూజలు



నగరి జూన్3: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు మళ్లీ ప్రమాణ స్వీకారం చేయాలని కోరుతూ స్థానిక సామాలమ్మ గుడిలో సోమవారం నగరి టీడీపీ నాయకులు రామానుజం చలపతి, లతల ఆధ్వర్యంలో పూజలు చేశారు. పసుపు కుర్చీలో చంద్రబాబునాయుడు ఫోటోను సామాలమ్మ గుడి ముందు వుంచి అమ్మవారికి ప్రత్యేకపూజలు, అర్చనలు చేశారు.

అన్నదానానికి రూ.1.11 లక్షల విరాళం

ఐరాల(కాణిపాకం), జూన్ 3: కాణిపాకం వరసిద్ధిని ఆలయంలో అన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన అఖిల్‌రెడ్డి సోమవారంరూ.1,11,000 విరాళంగా అందించారు. దాతను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



కూటమి విజయం కాంక్షిస్తూ పూజలు

చిత్తూరు సిటీ, జూన్ 3: కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ టీడీపీ నేతలు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని సీబీ రోడ్డులోని అగస్తీశ్వర స్వామి దేవస్థానంలో 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, నేతలు కాజూరు బాలాజీ, కాజూరు రాజేష్, గోపి, కిషోర్, రాజశేఖర్, శంకర్, కుప్పన్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



అగస్తీస్వర స్వామి దేవస్థానం వద్ద టీడీపీ నేతలు

కౌంటింగ్ కేంద్రం వద్ద కుప్పం నేతలు



చిత్తూరులోని కౌంటింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్

వర్షానికి కూలిన చెట్టు..తప్పిన ప్రమాదం

పుంగనూరు రూరల్, జూన్ 3: పుంగనూరులో కురిసిన వర్షానికి పోస్టాఫీసు వద్ద ఎర్రతు రాయి చెట్టుకూలింది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఎర్రతురాయి చెట్టు మొదలు బాగా తడిసి పోయింది. సోమవారం ఉదయం కొద్దిపాటి వర్షం కురవడంతో అప్పటికే వేర్లు బాగా బయల్పడి ఉండడంతో చెట్టు కూలిపోయింది. ఆ సమయంలో జనాలు రోడ్డుపై లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అయితే రోడ్డుపైనున్న ద్విచక్రవాహనంపై పడడంతో అది దెబ్బతింది. అలాగే పట్టణంలో ఎల్ఐసీ కాలనీ, కొత్తపేట, ఎన్ఎస్‌పేట, సూర్యానగర్ తదితర ప్రాంతాల్లో వర్షానికి రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఎన్ఎస్‌పేటలో రోడ్డుపై నీరు నిలిచిపోయింది. వనమలదిన్నె రోడ్డు, రామసముద్రం రోడ్డు గోతులమయంగా మారింది. ఆ గుంతల్లో చేరిన నీటితో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.







పోస్టాఫీసు వద్ద మోటారు సైకిల్‌పై కూలిన చెట్టు, ఎల్ఐసీ కాలనీలో వర్షపునీటితో అధ్వానంగా ఉన్న రోడ్డు, ఎన్ఎస్‌పేటలో గోతులమయమైన రోడ్డు

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



భోజన నిర్వాహకులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈవో

విజయపురం, మే 3: విజయపురం విద్యావనరుల కార్యాలయంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సోమవారం ఒకరోజు శిక్షణా సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం తయారీపై శిక్షణ ఇచ్చారు. వారు తయారు చేసిన వంటలను పర్యవేక్షించారు. రుచికరమై వంటకాలు తయారు చేసిన వారిని ఎంపిక చేసి ఎంఈవో హరిప్రసాద్‌వర్మ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉమాశంకర్, ధరణి, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.1.11 లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం), జూన్ 3: కాణిపాకం వరసిద్ధిని ఆలయంలో అన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన అఖిల్‌రెడ్డి సోమవారంరూ.1,11,000 విరాళంగా అందించారు. దాతను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయాలపై భారీగా పందేలు

ఐరాల, జూన్ 3: ఎన్నికల ఫలితాలపై పూతలపట్టు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉత్కంఠ నెలకొంది. విజయం ఎవరిని వరిస్తుందోనని పార్టీల నాయకులు, కార్యకర్తలు తర్జనభర్జనలు పడుతున్నారు. ఐరాల మండలంలో కొందరు భారీగా పందేలు కాసినట్లు సమాచారం. కొందరు పార్టీ విజయంపై లక్షల రూపాయల మేర బెట్టింగులు కాశారు. మండల వ్యాప్తంగా సుమారు కోటి రూపాయలకు పైగా బెట్టింగులు జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మామిడి పంటపై వచ్చే ఆదాయాన్ని చూపి వడ్డీలకు డబ్బు తెచ్చి మరీ ఉత్సాహం ప్రదర్శిస్తున్నారు. బెట్టింగ్ మొత్తాలను గ్రామంలోని నమ్మకమైన వ్యక్తి వద్ద ఉంచుతున్నారు. మరోవక్క అల్లర్లు జరగకుండా పోలీసులు గట్టి నిఘాను ఏర్పాటు చేశారు. 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు.



మాజీ మంత్రి నారాయణకు వినతి పత్రం ఇస్తున్న బలిజ సంఘం జిల్లా నాయకులు

కొత్త ప్రభుత్వంలో బలిజలకు న్యాయం చేయాలి

చిత్తూరు (సెంట్రల్), జూన్ 3: కొత్త ప్రభుత్వంలో బలిజలకు న్యాయం చేయాలని గ్రేటర్ రాయలసీమ బలిజ మహాసభ నాయకులు సోమవారం అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రులు సోమిరెడ్డి, నారాయణలను విజ్ఞప్తి చేశారు. కూటమి విజయానికి పనిచేసిన తమ సామాజిక వర్గ నాయకులకు తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. గ్రేటర్ రాయలసీమ జిల్లాల్లో కొత్తనాయకత్వాన్ని రాజకీయంగా ప్రోత్సహించాలని, తెలుగుదేశం, జనసేన పార్టీలకు మద్దతుగా నిలిచి నష్టపోయిన కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. నామినేటెడ్ పోస్టుల్లో అవకాశాలు కల్పించాలని, ఎంపీటీసీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, జెడ్పీ చైర్మన్ తదితర పోస్టులలో 10 శాతం స్థానాలు కేటాయించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సంఘం నాయకులు ఓఎం రామదాసు, శివప్రసాద్, విశ్వనాథ్, తులసీరాం, తదితరులు ఉన్నారు.



అగస్తీశ్వర స్వామి దేవస్థానం వద్ద టీడీపీ నేతలు

కూటమి అభ్యర్థుల విజయం కాంక్షిస్తూ పూజలు

చిత్తూరు సిటీ, జూన్ 3: కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ టీడీపీ నేతలు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని సీబీ రోడ్డులోని అగస్తీశ్వర స్వామి దేవస్థానంలో 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, నేతలు కాజూరు బాలాజి, కాజూరు రాజేష్, గోపి, కిషోర్, రాజశేఖర్, శంకర్, కుప్పన్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బలిజకండ్రిగలో అన్నదానం

పాలసముద్రం, జూన్ 3: చిత్తూరు టీడీపీ పార్లమెంటు కార్యదర్శి వాసు నాయుడు జన్మదిన వేడుకలను సోమవారం బలిజకండ్రిగలో ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. కేక్ కట్‌చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు మాట్లాడుతూ వాసునాయుడు మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. నాయకులు వెంకటేశులు నాయుడు, జె. విజయ్‌కుమార్, వాసు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉత్సవాలు



శెల్వవినాయక, పొన్నియమ్మన్ అమ్మ వార్ల ఊరేగింపు

గుడిపాల, జూన్ 3: మండలంలోని చుక్కావారిపల్లెలో మూడు రోజులుగా శెల్వవినాయక, పొన్నియమ్మన్ అమ్మవార్ల 40వ వార్షికోత్సవ ఉత్సవాలు సోమవారం ముగిశాయి. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు,ప్రత్యే పూజలు నిర్వహించారు. పురవీధులలో మంగళవాయిద్యాల మధ్య ఊరేగించారు. జీజేఎం నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు, టీడీపీ రాష్ట్ర నాయకులు హేమాద్రి నాయుడు, నేతలు పళణి, షణ్ముగం, ఆర్ముగం, దాము చుట్టు పక్కల గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజగోపాల్‌నాయుడుకు ఘన నివాళి



మాజీ ఎంపీ రాజగోపాల్‌నాయుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీలు

తవణంపల్లె, జూన్ 3: దిగువమాఘం రాజన్న పార్కులోని మాజీ ఎంపీ దివంగత పాటూరు రాజగోపాల్‌నాయుడుకు మహారాష్ట్ర ఎంపీలు శ్రీకాంత్ సిండే, శ్రీరంగ్ అప్పాబార్నే, గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్‌లు నివాళులర్పించారు. ఆయన విగ్రహానికి సోమవారం వీరు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలలపై వేటు తప్పదు



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

నగరి జూన్3:ప్రభుత్వ గుర్తింపు లేని ప్రయివేటు పాఠశాలలపై వేటు తప్పదని ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయలు పేర్కొన్నారు. నగరి మండలం, మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రయివేటు పాఠశాలల గుర్తింపును పరిశీలిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నిర్వహిస్తే డీఈఓ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

తవణంపల్లె, జూన్ 3: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఎస్ఐ మాట్లాడుతూ మంగళవారం మండల వ్యాప్తంగా 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. పోలీసులకు సహకరించాలని కోరారు. ర్యాలీలు, ఉరేగింపులు, బాణసంచా కాల్పులు లాంటివి నిషేదించారన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

కుప్పంలో పోలీసులు సన్నద్ధం



కుప్పం, జూన్ 3: కుప్పంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు సన్నద్ధమయ్యారు. కౌంటింగ్ సందర్భంగా నియోజకవర్గంలో ఎటువంటి అల్లర్లు చోటు చేసుకోకుండా తగి చర్యలు తీసుకోవడానికి అవవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రజలకు భరోసా ఇవ్వడానికి సోమవారం పట్టణంలో మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. నియోజకర్గపరిధిలోని పోలీసులు కాకుండా, వివిధ పోలీసు విభాగాలకు చెందిన 120 మంది బలగాలను అదనంగా కుప్పానికి ఎస్పీ కేటాయించారు. నియోజకవర్గంలోని సున్నితమైన ప్రాంతాలను ఇప్పటికే గుర్తించిన పోలీసులు, ఆయా చోట్ల అవసరమైన నిఘాను ఏర్పాటు చేశారు. కౌంటింగ్‌ను పురస్కరించుకుని కుప్పంలో 30 పోలీసు యాక్ట్‌తోపాటు, 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసు అధికారులు తెలిపారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించడానికి ప్రయత్నిస్తే అటువంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

● అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు

పుంగనూరు, జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పుంగనూరులో ఎలాంటి గొడవలు జరగకుండా మంగళవారం స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి సహకరించాలని అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు కోరారు. సోమవారం పుంగనూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించి మంగళ వారం చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 144సెక్షన్‌ను అమలులో ఉందన్నారు. ప్రధానంగా టీ దుకాణాలు మూసివేయాలన్నారు. పుంగనూరుతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం నలుగురికి మించి గుమి కూడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే గెలుపొందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం, టపాసులు కాల్చరాదని స్పష్టం చేశారు. కౌంటింగ్ సమయంలో ఎవరూ ఇతరులను రెచ్చగొట్టేలా వాట్సప్‌లో మెసేజ్‌లు చేయడం, సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టరాదని హెచ్చరించారు. రెచ్చగొట్టే ప్రకటనలు, పోస్టులు, ఫొటోలు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గొడవలు జరగకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెటింగ్‌లు ఉంటాయని, సీఆర్పీఎఫ్ బలగాలు తిరుగు తుంటాయని ఎక్కడ సమస్య తలెత్తినా పోలీసులు చేరుకుంటారని వివరిం చారు. ఈ సమావేశంలో సీఐ రాఘవ రెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ ఏజెంట్లు చిత్తశుద్ధితో, బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, సమావేశానికి హాజరైన టీడీపీ ఏజెంట్లు

● ఓట్ల లెక్కింపు ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలి

● కౌంటింగ్ ఏజెంట్ల శిక్షణలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల సూచనలు

చిత్తూరు సిటీ, జూన్3: ఓట్ల లెక్కింపులో టీడీపీ ఏజెంట్లు చిత్తశుద్ధితో, బాధ్యతగా పనిచేయాలని కూటమి ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులు గురజాల జగన్మోహన్, కలికిరి మురళి మోహన్‌లు అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ముఖ్యమైన ఫాం-17సీపై ప్రతి ఏజెంట్ అవగాహన కలిగి ఉండాలన్నారు. గత ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లంతా ఒకే మాటపై ఉండాలన్నారు. ఓటింగ్ యంత్రంలో నమోదైన ఓట్ల సంఖ్య ఫారం 17సీ లో ఉంటాయన్నారు. వీటిని సరిచూసుకుంటూ ఓటింగ్ యంత్రంపై ఉన్న సీల్స్‌ను జాగ్రత్తగా గమనించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఈసీ నిబంధనలకు విరుద్ధంగా ఏమైనా జరిగితే వెంటనే ఆర్వో దృష్టికి తీసుకెళ్ళాలని సూచించారు. ప్రజలు నమ్మకంతో వేసిన ఓట్లకు సరైన న్యాయం జరగాలంటే కౌంటింగ్ ఏజెంట్లు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, పార్టీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నేతలు చంద్రప్రకాష్, గుడిపాల బాలాజి, యన్‌పీఎస్ జయప్రకాష్, త్యాగరాజన్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై వేణుగోపాలుడు



ఆలయంలో వసంతోత్సవం

కార్వేటినగరం, జూన్ 3: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం హనుమంతు వాహనంపై స్వామి ఊరేగారు. ఆలయంలో మధ్యాహ్నం స్వామివారికి వసంతోత్సవాన్ని కన్నుల పండుగా వేద పండితులు నిర్వహించారు. అనంతరం మువ్వగోపాలుడు ఊంజల సేవ కార్యక్రమంలో సేద తీరారు. తర్వాత స్వామివారు గజ వాహనంపై పురవీధుల్లో ఊరేగి భక్తుల చేత కర్పూర హారతి నిరాజనాలు అందుకున్నారు.

సామాలమ్మ గుడిలో టీడీపీ నాయకుల పూజలు



నగరి జూన్3: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు మళ్లీ ప్రమాణ స్వీకారం చేయాలని కోరుతూ స్థానిక సామాలమ్మ గుడిలో సోమవారం నగరి టీడీపీ నాయకులు రామానుజం చలపతి, లతల ఆధ్వర్యంలో పూజలు చేశారు. పసుపు కుర్చీలో చంద్రబాబునాయుడు ఫోటోను సామాలమ్మ గుడి ముందు వుంచి అమ్మవారికి ప్రత్యేకపూజలు, అర్చనలు చేశారు.

పగలంతా పెన్షన్ కోసం తప్పని ఇబ్బందులు



సాయంత్రం 5గంటలకు సత్రవాడ బ్యాంకు వద్ద క్యూలో పింఛన్‌దారులు

నగరి జూన్3: ఈనెలలో కూడా పెన్షన్‌దారులకు తిప్పలు తప్పలేదు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పెన్షన్‌కోసంబ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. నగరి మున్సిపాలిటీ పరిధిలోని సత్రవాడ ఇండియన్ బ్యాంకు వద్ద సాయంత్రం 5 గంటలకు సైతం మహిళలు రోడ్డుపై క్యూలో నిల్చుని కనిపించారు.


గ్రానైట్ వ్యర్థాల తరలింపులో నిబంధనలకు నీళ్లు



ట్రాక్టర్‌లో గ్రానైట్ వ్యర్థాల తరలింపు

గుడిపాల, జూన్ 3: చిత్తూరు-వేలూరు, బెంగళూరు- చెన్నై జాతీయ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఈ నేపథ్యంలో గ్రానైట్ వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా ఎలాంటి రక్షణ లేకుండా పెద్దపెద్ద బండరాళ్లను సాధారణ స్థాయిలో వాహనాలపై తరలిస్తుతున్నారు. హైవేలో పల్లపు ప్రాంతాల నుంచిమిట్ట ప్రాంతాలకు వెళ్లే సమయంలో అవి వాహనం నుంచి కిందకు జారిపడే అవకాశం ఉంది. దానికి తోడు వ్యర్థాలతో వెళ్లే ట్రాక్టర్లను వేగంగా నడపడం వల్ల కుదుపునకు కూడా జారిపడే అవకాశం ఉంది. జారిపడిన రాళ్లను వెనుక వేగంగా వచ్చే వాహనాల వారు ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. నిబంధనల మేరకు వ్యర్థాలను తీసుకెళ్లాల్సి ఉన్నా అటు మండల రెవెన్యూ అధికారులు, ఇటు మైనింగ్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. పెద్ద ప్రమాదాలు జరగకముందే గ్రానైట్ వ్యర్థాలను రక్షణ నడుమ తరలించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

శిథిలావస్థకు గ్రంథాలయం



గుడిపాల, జూన్ 3: మండల కేంద్రంలో పాత ఎంపీడీవో కార్యాలయ ఆవరణ గొడౌన్‌లో నిర్వహిస్తున్న గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకుంది. కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. వర్షం వచ్చినప్పుడల్లా ఉరుస్తూ, పెచ్చులూడుతున్నాయి. వారం రోజుల పాటు వదలకుండా వర్షం పడితే ఆ చెమ్మకు గ్రంథాలయంలోని వార్తాపత్రికలు, పుస్తకాలు, ఇతర విలువైనవన్నీ నానుతున్నాయి. పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ఫలితంగా పాఠకుల సంఖ్య రోజు రోజుకూ తగ్గిపోతోంది. ఇప్పటికైనా పాఠకుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్త గ్రంథాలయ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పేదలకు అన్నదానం

బంగారుపాళ్యం, జూన్ 3: మండల కేంద్రంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద అన్నా క్యాంటీన్‌లో సోమవారం ఎర్రాండ్లపల్లికి చెందిన రాధా, చెన్నకేశవ నాయుడుల కుమార్తె కోక హారిక, కుమారుడు వైష్ణవ్‌ల జన్మదినం సందర్భంగా భోజనం వితరణ చేశారు. కార్యక్రమంలో జనార్దన్ గౌడ్, లోకనాథనాయుడు, సూరి నాయుడు, రమేష్, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొల్లగుంట వద్ద పోలీసుల తనిఖీలు



కార్వేటినగరం, జూన్ 3: అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన కొల్లాగుంట వద్ద కార్వేటినగరం ఎస్ఐ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ మంగళవారం ప్రారంభం కానున్న దృష్ట్యా కొల్లగుంట వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు.

నింద్రలో నేటి వారపు సంత రద్దు

నింద్ర, జూన్ 3: మండల కేంద్రంలో మంగళవారం వారపు సంతను ఈసారి నిర్వహించడం లేదు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో దీనిని నిర్వహించడంలేదని పంచాయితీ కార్యదర్శి ధరణి తెలిపారు. రానున్న మంగళవారం నుంచి వారపుసంత జరుగుతుందన్నారు.

మహాభారత ఉత్సవాలకు ధ్వజారోహణం



వెదురుకుప్పం, జూన్ 3: చెంచుగుడి మహాభారతం ఉత్సవాలకు సంబంధించి సోమవారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో ఉత్సవమూర్తులకు, విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిపించారు. ఉభయదారులుగా చెంచుగుడికి చెందిన విజయశేఖర్‌రెడ్డి, హరి దంపతులు వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త పూల వెంకటరామిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆవుదేవర నందీశ్వరుడికి రుద్రాభిషేకం



వెదురుకుప్పం, జూన్ 3: చవటగుంటలోని ఆవుదేవర నందీశ్వర దేవస్థానంలో సోమవారం నందీశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ క్రమంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు జరిగాయి. సీఆర్‌కండ్రిగకు చెందిన బండి వెంకటరమణారెడ్డి, సౌదామణి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. వివిధ గ్రామాల భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

వృద్ధురాలి మెడలో బంగారుగొలుసు చోరీ

పుంగనూరు రూరల్, జూన్ 3: సినీ ఫక్కీలో ఓ వృద్ధురాలి మెడలో పట్టపగలే గుర్తుతెలియని దుండగులు బంగారు గొలుసు లాక్కెళ్లారు. ఈ ఘటన సోమవారం పుంగనూరులో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. సోమలకు చెందిన సహదేవరాజు భార్య పద్మావతమ్మ (70) గత శుక్రవారం బెంగళూరు నుంచి సొంతగ్రామానికి చేరుకుంది. తిరిగి బెంగళూరుకు వెళ్లేందుకు పుంగనూరు ప్రైవేట్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా 58 గ్రాముల బంగారు చైన్‌ను గుర్తు తెలియని దుండగులు లాక్కెళ్లారు.



ప్రమాద అంచున ట్రాక్టర్‌లో రాళ్లు తరలిస్తున్న ఈ చిత్రం చూశారా.. వెదురుకుప్పం మండలంలో ఈ తరహాలో తరచూ రాళ్లను రవాణా చేస్తున్నారు. రాళ్ల వాహనదారుల నుంచి జారి పాదచారులపై పడితే గాయాలపాలవ్వక తప్పదు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి ఈ తరహా రవాణా కట్టడికిచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- వెదురుకుప్పం

నిబంధనలున్నా ఆగని ఇసుక అక్రమ రవాణా



ధర్మరాజుల ఆలయం వద్ద ఇసుక టిప్పర్

కార్వేటినగరం, జూన్ 3: కార్వేటినగరం ధర్మరాజుల గుడి ప్రాంగణంలో ఇసుక బహిరంగ విక్రయాలు జోరుగు సాగుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్నప్పటికీ ఇసుక అక్రమ రవాణా కార్యకలాపాలను కట్టడి చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. కృష్ణాపురం ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెరిగింది. ఇసుక అక్రమ రవాణా దారులు కొత్త మార్గాల ద్వారా కార్వేటినగరం టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారు. ప్రైవేటు సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ముగిసిపోయిందని జిల్లా స్థాయి అధికారులు ప్రకటించినా ఆచరణలో ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆగలేదు. కార్వేటినగరం పోలీస్ స్టేషన్‌ను దాటుకుని పుత్తూరు చిత్తూరు జాతీయ రహదారిపై టిప్పర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నా అధికారులు కిమ్మనడం లేదు. ఇసుక అక్రమ రవాణా దారుల నుంచి మామూళ్లు తీసుకుని కొమ్ము కాస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్వేటినగరం ధర్మరాజుల గుడి ప్రాంగణంలో జరుగుతున్న బహిరంగంగా ఇసుక విక్రయాలపై జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.